వంతెనపై నుంచి వెళ్లేదెలా!

- బ్రిడ్జిపై నిత్యం నిల్వ ఉంటున్న నీళ్లు
- రోడ్డుకంటే కిందికి నిర్మించడంతో ఈ దుస్థితి
- రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెద్దవూర : మండలంలోని పూల్యాతండా వద్ద ఏఎమ్మార్పీ కాల్వపై నిర్మించిన వంతెనపై నిత్యం నీళ్లు నిలిచివుంటుండంతో నడవటానికి కష్టంగా మారింది. దీంతో తండావాసులు కాల్వ అవతలి వైపు ఉన్న వ్యవసాయ పొలాలకు వెళ్లడానికి కిలో మీటరు మేర ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. ఏఎమ్మార్పీ అధికారుల తో తండావాసులు ఈ విషయమై మొరపెట్టుకోవడంతో పూల్యాతండా వద్ద గత ఏడు సంవత్సరాల క్రితం వంతెనను నిర్మించారు. ఈ వంతెనను రోడ్డుకు నాలుగైదు అడుగుల లోతులో నిర్మించారు. దీంతో ఏఎమ్మార్పీ నీళ్లు, తండాలోని వృథానీరు, వ్యవసాయ పొలాల నుంచి వచ్చే వాన నీరు అంతా వంతెనపై నిలిచి మురుగు గుంత లాగా తయారై మోకాళ్ల లోతు నీళ్లు నిలిచి ఉంటున్నాయి. వర్షాకాలంలో వంతెనపై నిత్యం నీళ్లు నిలిచి ఉంటుండంతో వంతెనపై నుంచి వెళ్లే పరిస్థితి ఉండదు. వ్యవసాయ పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు మోకాళ్ల లోతు నీటిలోనుంచి పశువులు తోలుకుంటు, తాము తడుస్తూ వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా రైతులు, కూలీలదైతే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఏఎమ్మార్పీ లో లెవెల్ వరద కాల్వ హెడ్ రెగ్యులేటర్, పంప్ హౌజ్ వద్దకు వెళ్లాలంటే కూడా మోకాళ్లలోతు నీళ్లలోనుంచి వెళ్లాల్సిందే. దీంతో ద్విచక్ర వాహనాలు ఈ నీటిలో ఆగిపోయి సైలెన్సర్లలోకి నీరు పోయి చెడిపోతున్నాయి. ఈ వంతెనపై నీరు నిల్వ వుండకుండా ఎత్తుగా కంకర పోసి ప్లాస్టింగు చేయాలని తండావాసులు, వాహనదారులు కోరుతున్నారు.



పూల్యాతండా వద్ద వంతెనపై నిలిచిన నీరు



వంతెనపై నీళ్లలో నుంచి వస్తున్న వాహనాలు

ఇబ్బందులు పడుతున్నాం



ఏఎమ్మార్పీ వరద కాలువపై నిర్మించిన ఇరుకు వంతెనపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో నిత్యం మోకాళ్ల లోతులో నీరు నిలిచి ఉంటుంది. పంట పొలాలకు వెళ్లాలంటే నీళ్లలో నుంచే పశువులను తోలుకుని వెళ్తున్నాం. చెప్పులు చేతపట్టుకుని, బట్టలు మోకాళ్లపైకి పెట్టుకుని వెళ్తున్నాం అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. – రమావత్ సేవానాయక్, పూల్యాతండా

సాగర్ కాల్వల్లో కంపచెట్లు తొలగించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : సాగర్ కాల్వల్లో కంపచెట్లను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గూడూరు గ్రామ శివారులో ఉన్న కిష్టాపురం మేజర్ కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది వర్షాలు లేక సాగునీరు అందకపోవడంతో కాల్వలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయన్నారు. ప్రస్తుతం సాగునీటిని విడుదల చేసినప్పటికీ కాల్వల్లో పూడుకుపోవడంతో కాల్వ చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీరు వస్తుందన్న ఆశలో రైతులు పంటను సాగు చేసుకుంటున్నారని వెంటనే కాల్వను శుభ్రం చేసి కాల్వకు నీరందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ లక్ష్మణ్‌నాయక్‌లకు సమస్యను వివరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు జగదీశ్చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, రవినాయక్, పిల్లుట్ల సైదులు, బాలాజీ నాయక్, సాగర్‌నాయక్, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలతో నిండి ఉన్న కాల్వను పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ సీఐ నర్సింహులు అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన టి.గణేశ్ అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో ఓ యాప్ కోసం సెర్చ్ చేస్తుండగా అతడికి డిస్‌ప్లేపై కన్పించిన లింక్‌ను ఓపెన్ చేశాడు. దీంతో ఓటీపీ వచ్చి రాగానే అతని అకౌంట్లో ఉన్న రూ.93వేలు డెబిట్ అయినట్లు గ్రహించాడు. వెంటనే అప్రమత్తమైన గణేశ్ సైబర్ క్రైం (1930)కి ఫిర్యాదు చేశాడు. అదే రోజు అతడికి రూ.75వేలు నగదు రిఫండ్ అయినట్లు సీఐ పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, అకౌంట్ నంబర్ గాని అడిగితే వారికి ఎలాంటి సమాచారం ఇవ్వొదన్నారు.

క్లుప్తంగా

టెయిల్ పాండ్ నుంచి నీటి విడుదల బంద్

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి టెయిల్‌పాండ్ నుంచి దిగువకు నీటి విడుదలను డ్యాం అధికారులు నిలివేశారు. నాగార్జున సాగర్ జలాశయం నుంచి టెయిల్ పాండ్‌కు 29.841 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. కాగా విద్యుత్ ఉత్పాదనకు 8వేల 72క్యూ సెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి : వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్‌టెన్త్, ఇంటర్ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని జెడ్పీహెచ్‌ఎస్ పీఏపల్లి కోఆర్డినేటర్ వెంకటయ్య తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు.అడ్మిషన్లు కావల్సిన వారు గతంలో చదివిన తరగతి రికార్డుషీటు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణపత్రం, ఫొటోలతో సంప్రదించాలని కోరారు.

గర్భాశయ కేన్సర్‌ను నివారించవచ్చు

మిర్యాలగూడ అర్బన్ : ప్రతి ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షా ఇరవై వేలమంది మహిళలు గర్భాశయ ముఖద్వార కేన్సర్‌తో బాధపడుతున్నారని, తొలిదశలోనే గుర్తించినట్లయితే వ్యాక్సిన్ తో నివారించవచ్చని ప్రముఖ గైనకాలజిస్టులు అభిప్రాయపడ్డారు. సోమవారం నల్లగొండ స్త్రీ వ్యాధి నిపుణుల సంఘం ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి ఆస్పత్రిలో నిర్వహించిన కాల్పోస్కోపి వర్క్‌షాప్‌లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఎంఏ మిర్యాలగూడ అధ్యక్షురాలు డాక్టర్ జీవనజ్యోతి గర్భాశయ ముఖద్వార కేన్సర్ స్క్రీనింగ్ ద్వారా వచ్చే జబ్బులు, వాటి నివారణపై వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ స్త్రీ వ్యాధి వైద్యనిపుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆర్.మంజుల, కార్యదర్శి రాజేశ్వరి, ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్పోస్కోపి అండ్ క్లీనిక్ పెథాలజీ అధ్యక్షురాలు లీలా, కామినేని మెడికల్ కాలేజీ హెచ్‌ఓడి ప్రసన్న, అమూల్య తదితరులు ఉన్నారు.

సోమినేని చెరువు నింపాలని వినతి



ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు వెంకట్రాంనాయక్

త్రిపురారం : మండలంలోని అంజనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమినేని చెరువును సాగర్ ఎడమ కాలువ నీటితో నింపాలని త్రిపురారం మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధనావత్ వెంకట్రాంనాయక్ గిరిజన రైతులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గిరిజన తండాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల నీటికి ఇబ్బందులు పడుతున్నామని, సోమినేని చెరువు నింపడం వల్ల గిరిజన తండాలకు నీటి వసతి ఉంటుదన్నారు.

ఎర్రబెల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో 330 నివాసాల్లో 1106 మందిని సిబ్బంది సర్వే చేశారు. 11 మంది రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలుగురికి జ్వరం ఉన్నట్లుగా గుర్తించారు. వారికి పలు జాగ్రత్తలు చెప్పారు. దోమల నివారణ మందు చల్లించి, ఫాగింగ్ చేశారు. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసా రవి, డాక్టర్ రఫి, సీహెచ్‌ఓ రమేష్, హెచ్‌ఈఓ వాసుదేవరరెడ్డి, ప్రభాకర్, సిబ్బంది రజిని, జోసెఫ్, మంజుల, సుచరిత, స్వప్న, ఆశ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న అమీర్ అలీ

హాలియా : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి మంచి గుణాలు అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పేరూర్ శివాలయం దేవస్థానం కమిటీ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, అమీర్ అలీ ఫౌండేషన్ చైర్మన్ అమీర్ అలీ అన్నారు. అమీర్ అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన ఆర్మీ జవాన్ ఈరేటి మహేష్ జ్ఞాపకార్థం సోమవారం మంగళవారం అనుముల మండలంలోని మదారిగూడెం ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, కంబాక్స్‌లు తదితర సామగ్రిని వారు పంపిణీ చేసి మాట్లాడారు. దేశ సేవ కోసం ఆర్మీలో చేరి అకాలంగా ఈరేటి మహేష్ మృతి చెందడం చాలా బాధకరమన్నారు. వీరజవాన్ మహేశ్ జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మృతి చెందిన జవాన్ మహేష్ చిత్రపటానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాసింగ్, పార్వతమ్మ, మాజీ సర్పంచ్ సైదులు, రావుల వెంకటేశ్వర్లు, నజీర్ పాష, పోశం శ్రీనివాస్, సర్వర్, జానీ, కట్టా మనోహర్, చెన్ను నరసింహరెడ్డి, కట్టా మధు, ఆర్ శ్రీను జహీర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పలువురు అధికారులు గైర్హాజరు

పెద్దవూర: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ఇప్పటికే అందరూ నిర్ణీత సమయానికి ముందే వచ్చి ఉండాలని జిల్లా కలెక్టర్ కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ఆలస్యంగా వచ్చే అధికారులు, గైర్హాజరయ్యే అధికారుల వివరాలు నమోదు చేసి తనకు రిపోర్టు చేయాలని సర్క్యులర్ సైతం జారీ చేశారు. అయినా ఇవేమీ పట్టకుండా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు దుమ్మా కొట్టారు. దీంతో ప్రజావాణిలో కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. ఈ ప్రజావాణి కార్యక్రమానికి ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ ఉమాదేవి తెలి పారు. ఇందులో మూడు విద్యుత్, 2 రెవెన్యూ, ఒక టి మిషన్ భగీరథకు సంబందించి ఉన్నట్లు తెలిపారు.



పెద్దవూర : అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

త్రిపురారంలో 11 దరఖాస్తులు

త్రిపురారం : మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో 11 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో స్పందన కరువైంది. కొందరు దరఖాస్తుదారులు జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. పలు శాఖల అధికారులు కూడా ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావడంలేదు. అత్యధికంగా రెవెన్యూ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు దరఖాస్తుదారులు వాపోతున్నారు.

మిగతా రుణాన్ని చెల్లించి రుణమాఫీ పొందాలి

మిర్యాలగూడ : ప్రభుత్వం చేపడుతున్న రుణమాఫీ పథకంలో భాగంగా రూ.2లక్షల కంటే ఎక్కువగా బ్యాంక్‌లో రైతులు రుణాన్ని తీసుకున్నట్లయితే రూ.2లక్షల కంటే ఎక్కువగా రుణాన్ని వడ్డీతో సహా చెల్లించి రూ.2లక్షల రుణమాఫీ పొందవచ్చని ఏడీఏ పోరెడ్డి నాగమణి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కుటుంబానికి రూ.1.50లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేసిందని, మూడో విడత రుణమాఫీ కింద రూ.2లక్షల వరకు రైతులు లబ్ధి పొందడానికి రూ.2లక్షలు మినహాయించి మిగిలిన డబ్బులను వడ్డీతో సహా బ్యాంక్‌లో చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరిత, ఏఈఓలు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 26 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి-2, వ్యవసాయ శాఖకు సంబంధించి-1, ఎంపీడీఓ కార్యాలయానికి సంబంధించి 23దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం



దేవరకొండ : అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు



హాలియా : ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు, విద్యార్థులు

దేవరకొండ : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలో దేవరకొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నతమైన జీవితాన్ని గడపాలన్నారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం ఎవరికి తెలిసినా తమకు తెలియజేయాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నరసింహా,నర్సింగరావు, ఎంకేఆర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవి, మల్లయ్య ఉన్నారు.

హాలియా : ఆరోగ్యానికి హాని చేసే మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాడుపడాలని ఎక్సైజ్, పోలీస్‌శాఖల సీఐలు కల్పన, జనార్దన్ గౌడ్ అన్నారు. డ్రగ్స్ నిర్మూలనపై ఎక్సైజ్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం ఎంతో ప్రమాదకరమన్నారు. గంజాయి, మద్యానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వద్దంటూ ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. చిన్నప్పటి నుంచి డ్రగ్స్‌తో కలిగే ప్రమాదాలపై అందరికీ అవగాహన కల్పించాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐ సంపత్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్, సిబ్బంది రహీమ్, శ్రీనివాస్, సుధాకర్, జహంగీర్, చిన్ని తదితరులు ఉన్నారు.

తపాలా ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ

గుర్రంపోడు : ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మండలకేంద్రంలో సోమవారం తపాలా ఉద్యోగులు హర్ ఘర్ తిరంగా నినాదంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమాజ అభివృద్ధి కార్యక్రమంపై తపాలా శాఖ అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సబ్‌పోస్టు మాస్టర్లు ఎన్. నర్సింహ్మాచారి, బి. అంకులయ్య, ఎంఓలు బొడ్డుపల్లి నర్సింహ్మా, శ్రీకాంత్, బీపీఎంలు ఈశ్వర్, రవీంద్రాచారి, రాజు, నీలయ్య, యాదగిరిరెడ్డి, విజయలక్ష్మి, సందీప్, ఈడీఎంసీలు శ్రీకాంత్, వినోద్, మధుసూదన్, రామలింగయ్య, నగేష్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా ఉద్యోగులు

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



పెద్దఅడిశర్లపల్లి : నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

మిర్యాలగూడ టౌన్ : సర్వశిక్షాభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని రెగ్యూలర్ చేయాలని క్లర్క్ కం ఆపరేటర్(డేటా ఎంట్రీ) మండల కో ఆర్డినేటర్ ఎం. నిరంజన్. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ జి. హరీక అన్నారు. సోమవారం స్థానిక మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్‌సీ) కార్యాలయంలో ఇటీవల మృతి చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ల చిత్రపటాలకు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బ్రహ్మాచారి, జ్యోతి, నర్సయ్య, గోవర్ధనాచారి, రేణుక, జ్యోతి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దఅడిశర్లపల్లి : సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించలేక గుండెపోటుతో మరణించిన ఉద్యోగుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకట్, ప్రేమ్‌సాగర్, నరేష్, లింగయ్య, గోవింద్, రవిందర్, సరళ, పావని, లక్ష్మి, సుజాత, రాందాసు తదతరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ జాతీయ భావం చాటాలి

చింతపల్లి : మండల కేంద్రంలో బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ భారత దేశంలో నివసించే ప్రతి ఒక్కరూ జాతీయ భావంతో మెలగాలన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా స్వచ్ఛందంగా ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేశ్ యాదవ్, కుకుడపు రామకృష్ణ, చెన్నయ్య, అభినవ్, వెన్నం శేఖర్, శ్రీనివాస్, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : 'హర్ ఘర్ తిరంగ్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో సోమవారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ఇన్‌చార్జ్ కేసరి శోభ, శిరీష, యాదమ్మ, భాగ్యమ్మ, రేణుక, విజయలక్ష్మి, నాగమణి, సైదమ్మ, రాణి, హరిత, సింధూజ, తేజస్వీని తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : ర్యాలీని ప్రారంభిస్తున్న సరిత

విరాళం ప్రకటించడంపై కలెక్టర్ అభినందన

నల్లగొండ: జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దేందుకు జిల్లా అధికారుల సంఘంతో పాటు టీజీఓలు, టీఎన్జీఓల అసోసియేషన్‌లు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించడంపై కలెక్టర్ నారాయణరెడ్డి అభినందించారు. సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిధులతో విద్యార్థులకు యూనిఫాం, షూ, టై, బ్యాగులు, క్రీడా సామగ్రి, భోజన ఏర్పాట్లు, బస్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌డీఓ రాజ్యలక్ష్మి, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



దేవరకొండ : ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న పల్లా దేవేందర్‌రెడ్డి

పెద్దవూర : ఏఐఎస్ఎఫ్‌ఐ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు మండల కేంద్రంలో ఆ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో నిరంతరం విద్యార్థుల వెన్నంటి ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల లెఫ్ట్ ఆర్గనైజేషన్ నిర్మాణ బాధ్యులు ఎస్‌కే బషీర్, నాయకులు మల్లిఖార్జున్, రుపావత్ విష్ణునాయక్, సంతోష్, శ్రీరాం, అఖిల్, సిద్దు, జగన్, చరణ్, గణేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

సమరశీల ఉద్యమ రథసారథి ఏఐఎస్ఎఫ్

దేవరకొండ : సమరశీల ఉద్యమ రథసారధి ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ డివిజన్ సమితి ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఆ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వినయ్, శంషోద్దీన్, వెంకట్రాములు,అనిల్,సిద్ధార్థ్,దినేష్, వినోద్ ఉన్నారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ పాత్ర కీలకం

హాలియా: దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ ఎంతో కీలక పాత్ర పోషించిందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు అన్నారు. సోమవారం హాలియా పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. . కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు ఆర్ విష్ణు నాయక్, మండల నాయకులు సంతోష్, శ్రీరామ్, అఖిల్, సిద్దు, జగన్, చరణ్, గణేష్, మధు, అశోక్ తదితరులు ఉన్నారు.

మొక్కల పంపిణీ

హాలియా : పట్టణంలో ఆరో వార్డులో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలను యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాధ్యమైనన్ని మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి నప్పుడే భవిష్యత్ తరాలకు నీటితో పాటు కాలుష్యరహిత ఆక్సిజన్ అందించిన వారమవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న రాజా రమేష్‌యాదవ్

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



హాలియా : విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసులు



డిండి : విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయురాలు

హాలియా : 38వ నేషనల్ షాటోఖాన్ కరాటే టోర్నమెంట్ పోటీల్లో హాలియా పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ మేడపల్లి మోహన్ రావు, డైరెక్టర్ తడకమళ్ల శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఈనెల 11న నకిరేకల్‌లో నిర్వహించిన 38వ నేషనల్ కరాటే చాంపియన్ 2024 పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఆర్ సిద్దేశ్వరరాయ్ స్వర్ణం, కార్తికేయ వెండి, సుదీక్ష, మాన్వి, అంజలి, రామ్ చరణ్, హర్షిత కాంస్య పతకాలను గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కరాటేలో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన కరాటే మాస్టర్ సైదులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపి నాయర్, పీఈటీ రాంబాబు, ఉపాధ్యాయుడు విజయ్ ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

డిండి : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో షోటోఖాన్ కరాటే అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టోర్నమెంట్‌లో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ టోర్నమెంట్‌లో బల్మూరి ఇందు, ఆకాంక్ష, సిరి, చందన, మోహిత్, సాకేత్, వైష్ణవిలు గోల్డ్ మెడల్, బల్మూరి అభినయ్, మధు, నిషిత, వైశాలిలు సిల్వర్ మెడల్ సాధించారు. సోమవారం ఆదర్శ పాఠశాలలో ఉపధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ లక్పతినాయక్, ఉపధ్యాయులు అంజయ్య, జిలానీ, సత్యానారయణ పాల్గొన్నారు.

తిరుగు పయనంలో గొర్రెల మందలు





జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న గొర్రెల మందలు

పెద్దవూర : తీవ్ర వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాసం దొరకక మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు జిల్లాల నుంచి గొర్రెల కాపరులు మందలను తోలుకుని మేపుకుంటూ నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతానికి ఆరు నెలల క్రితం వలస వచ్చారు. ప్రస్తుతం వర్షాలు పడి ప్రాజెక్టు నిండటంతో ఇక్కడ ప్రాంతంలో రైతులు నార్లు పోసి, నాట్లు వేస్తుండటంతో తమ గొర్రెలను మేపుకుంటూ కాపరులు తమ స్వగ్రామాలకు తిరుగు పయనమయ్యారు.